


బియ్యం పంపిణీలో సమస్యలపై టోల్ ఫ్రీ నెంబర్ 1967

జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్

ప్రజాశక్తి-విజయనగరం

రేషన్ బియ్యం పంపిణీలో అవకతవకలు జరిగినా, సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. ప్రజల సౌకర్యార్థం టోల్ ఫ్రీ నెంబర్ 1967ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో బియ్యం పంపిణీలో లేదా ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఇబ్బందులు ఉన్నా తూనికలు, కొలతల విషయంలో లోపాలు తలెత్తినా ఫిర్యాదు చేయవచ్చని, వినియోగదారుల సంరక్షణ చట్టం-2019 ప్రకారం పరిష్కరించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ సేవలను రైతులు, సామాన్య ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఏవీ నాటి సంక్రాంతి సందళ్లు ?

- మారుతున్న గ్రామీణ ముఖచిత్రం
- పచ్చదనం కోల్పోతున్న పల్లెలు
- కనుమరుగవుతున్న వృత్తులు
- సంక్రాంతి వేళ వింతలా చూడాల్సిన పరిస్థితి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఓవైపు ఆధునిక పరిజ్ఞానం... మరోవైపు సంస్కృతి, సంప్రదాయాలను దెబ్బతీసే విధానాలు వెరసి గ్రామీణ ముఖచిత్రాలు మారుతున్నాయి. ఇందులో అభివృద్ధికి దోహదపడే అంశాలను కాస్త పక్కనబెడితే... వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధానాలు గ్రామీణ శోభను దెబ్బతీశాయి. సంక్రాంతి వేళ పుట్టిపెరిగిన ఊళ్లలో చిన్ననాటి జ్ఞాపకాలు, తీపిగుర్తులు నెమరువేసుకుని హాయిగా గడపాలని వచ్చేవారికి ఒకింత నిరాశ ఎదురౌతోంది. ప్రభుత్వ విధానాలు అందులో ప్రాధాన్యతలే ఇందుకు మూలం.

సంక్రాంతి అంటేనే గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టే పాడిపశువులు, పంటలు, గొబ్బెమ్మలు, నాటు బండ్లు, హరివిల్లులను తలపించే ముగ్గుల పోటీలు గుర్తుకు వస్తాయి. వాటన్నింటినీ తమ సొంత ఊళ్లలో తనివితీరా చూడాలనే ఆశతో ఎంతో దూరంలో వున్నవారు సైతంసొంత గ్రామాలకు ఇంటిల్లా పాది తరలివస్తుంటారు. మారిన విధానాలతో ప్రస్తుతం గ్రామీణ ముఖచిత్రాలు మారి పోయాయి. మన జిల్లా భౌగోళికంగా రాష్ట్రంలో అన్నింటికన్నా చిన్నది. జిల్లాల పునర్విభజన వల్ల విజయనగరం చాలా జిల్లాలతో పోలిస్తే పెద్దది. పార్వతీపురం మన్యం జిల్లా దాదాపు రాష్ట్రంలో చిన్నది. అయినా వనరులకు కొదవలేదు. విశాలమైన ఏజెన్సీ ప్రాంతం జిల్లాకు మణిహారంలా ఉంటుంది. ఈ రెండు జిల్లా పరిస్థితులు ఒక్కసారి అవగతం చేసుకుంటే...సారవంతమైన భూములు ఉన్నాయి. వ్యవసాయ, ఉద్యాన, వాణిజ్య పంటలు సాగు చేసేందుకు ఎంతో అనువుగా ఉంటుంది. సాగునీటి వనరులు పెద్దగా లేకపోయినప్పటికీ ఎన్నో నదులు, జీవగెడ్డలు ఉండడం వల్ల వాటిలో నీటిని ఒడిసిపట్టి వరి, చెరకు, మొక్కజొన్న, పత్తి, మినుములు, పెసలు వంటి వ్యవసాయ పంటలు సాగుచేసే పరిస్థితి ఈ జిల్లాల ప్రత్యేకం.

ఇతర జిల్లాలతో పోల్చుకుంటే మన జిల్లాలో భూ కమతాలు చాలా చిన్నవిగా వుండడం, ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణ అందుకునేందుకు ఆర్థికంగా రైతులకు వెసులుబాటు లేకపోవడం వంటి కారణాల వల్ల ఐదారేళ్ల క్రితం వరకు నాగలితోనే దుక్కులు పట్టేవారు. ఇంకొంచెం ముందుకు వెళ్తే... కుటుంబానికో నాటుబండి ఉండేది. వాటిని తయారు చేసే వడ్రంగి



నిత్యం పనిలో బిజీగా ఉండేవాడు. మరెక్కడా లేనంతగా జనుము సాగు ఉండడంతో వాటిని చెరువుల్లో ఊరబెట్టడం, వారం పది రోజుల తరువాత నారతీసి విక్రయించుకునేవారు. ఆ కర్ర (కటికర్ర)లు వంటచెరకుగా ఉపయోగ పడేవి. ఇక వరి ప్రతి ఇంటా పండేది. సంక్రాంతికి కొద్దిరోజుల ముందు పసువులతో మట్టించడం, లేదా రోలర్లు (పెద్దపెద్ద రాళ్లు)తో వరి నూర్పులు చేసేవారు. ఆ క్రమంలో రైతులు పడ్డ శారీరక కష్టాన్ని మర్చిపోయి పని సునాయాశంగా నడిచేందుకు జానపదాలతో కల్లాలన్నీ వీణుల విందుగా మారేవి. ఇప్పట్లో కల్లాలంటే పశువులు, కోళ్ల పెంపకంతోపాటు నాగళ్లు, నాటుబండ్లు, వడ్లరాసులు, ధాన్యపుగాదులు కనిపించేవి. ఇలా రైతులు, ఇతర వృత్తిదారులు, సరుకులమ్మే షావుకారుల దుకాణాల్లో శ్రమ జీవన సౌందర్యం సంక్రాంతి సమయాల్లో ఉట్టిపడేది. ఉద్యోగం, వ్యాపారం రీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లి పండక్కి వచ్చేవారంతా ఇక్కడి యాసభాషల్లో కలగలిసి ఎంచక్కా పల్లె వాతావరణాన్ని ఎంజాయ్ చేసేవారు. మరోవైపు నదీ పరివాహక గ్రామాల్లో ఇసుక తెన్నులపై సంక్రాంతి మరుచటి రోజు కనుమ సందర్భంగా యువత సందడిగా గడిపేవారు. కానీ నేడు ఇసుక తవ్వకాల వల్ల ఎక్కడా ఇసుక తెన్నులు కానరావడం లేదు. పైగా నదులన్నీ వాటి స్వరూపాలు మారిపోయి గోతులుగా దర్శనమిస్తున్నారు. ఫలితంగా నేడు గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టే వాతావరణం కనుమరుగవుతోంది.

విజయనగరం ఉమ్మడి జిల్లాలో సాగుభూమి తగ్గిపోయింది. వాస్తవానికి మన జిల్లా భౌగోలిక విస్తీర్ణం 16, 34,750 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో 9,25,387.5 ఎకరాల్లో వివిధ వ్యవసాయ, వాణిజ్య పంటలు సాగయ్యేవి. కానీ సాగుభూమి ఏటా తగ్గిపోతోంది. ప్రస్తుత ఖరీఫ్‌సీజన్‌లో కేవలం 3,41,130 ఎకరాల్లో మాత్రమే సాగయ్యాయి. వ్యవసాయ రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 80శాతం జనాభా ఆధారపడి జీవిస్తోంది. కానీ, అపారమైన సాగునీటి వనరులు ఉన్నా వాటిని వినియోగంలోకి తేవడంలో పాలకులు విఫలమయ్యారు. సాగునీటి వసతి కల్పించక పోవడం, ఉద్యాన పంటలను తగినంతగా ప్రోత్సహించక పోవడం, ప్రభుత్వం బోర్లు, బావులు మంజూరు చేయకపోవడం, మైక్రో ఇరిగేషన్ పథకాలు పూర్తిగా స్తంభించడం వంటి కారణావల్ల సాగు భూమి తగ్గుతోంది. ఈ ప్రభావం రైతులతో పాటు వ్యవసాయ రంగంపై ఆధారపడిన కార్మికులు, వృత్తిదారులపైనా పడింది. మత్స్యకారులు, వడ్రంగి, చేనేత వంటి వృత్తుల నుంచి నేటి తరం దూరమౌతోంది. సుమారు 30ఏళ్లలో వచ్చిన మార్పులే ఇందుకు నిదర్శనం. ఇలా గ్రామీణ ముఖచిత్రాలే మారి పోతుండడంతో వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు, నాటు బండ్లను చివరకు రైతులు ధరించే సంప్రదాయ దుస్తులను కూడా నేటి జనం వింతగా చూడాల్సిన దుస్థితి దాపురిస్తోంది.

పని సర్దుబాటు రద్దుచేసి ఉద్యోగోన్నతులు చేపట్టాలి

డిఇఒకు ఫ్యాప్టో నాయకుల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత పేరుతో ఎటువంటి నిబంధనలూ పాటించకుండా చేస్తున్న పని సర్దుబాటును తక్షణం రద్దుచేసి, గతంలో చేసిన ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఫ్యాప్టో జిల్లా చైర్మన్ బి.మహేశ్వరరావు ఆధ్వర్యంలో కలెక్టర్ సూర్యకుమారిని, విద్యాశాఖ అధికారి లింగేశ్వర్ రెడ్డిని కలిసి వినతి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్వీసు నిబంధనలలో లేని అంశాన్ని కొత్తగా పని సర్దుబాటు పేరుతో ప్రస్తుతం ఉన్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు కేవలం రూ.2500/- అదనంగా చెల్లించి హైస్కూల్ కు పంపించడం సరికాదని , నిబంధనల మేరకు తక్షణమే పూర్తిస్థాయి ఉద్యోగోన్నతులు చేపట్టాలని



డిఇఒకు వినతి పత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

కోరారు. ఇటువంటి విధానం వల్ల భవిష్యత్తులో ఉద్యోన్నతులు ప్రక్రియకు తీవ్ర ఆటంకం కలుగుతుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు డి.శ్యామ్, రమేష్ చంద్ర పట్నాయక్, డి.ఈశ్వరరావు, పి.శ్రీనివాసరావు, సన్యాసిరాజు, డి.రాము, బుకారిబాబు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుల పాకల ఘటనకు బాధ్యులపై చర్య తీసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని ఎరుకుల పాకల గ్రామంలో ఇటీవల విద్యుత్ సమస్యకు కారణమవ్వడమే కాకుండా, అనేక మంది వద్ద అక్రమంగా డబ్బులు వసూలు చేసి ఇబ్బంది పెడుతున్న పత్రికా (ప్రజాశక్తి కాదు) విలేకరిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామాన్ని సందర్శించిన సి పిఎం నాయకులకు పలువురు బాధితులు ఆ విలేకరిపై ఫిర్యాదు చేశారు. తన వద్ద రూ.50వేలు తీసుకొని తిరిగి అడిగితే అధికారులపై ఒత్తిడి చేసి తమ గ్రామానికి విద్యుత్ లేకుండా చేసి ఇబ్బంది పెట్టాడని గ్రామ ఎంపిటిసి పాలవలస గౌరు సిపిఎం నాయకుల వద్ద ఆవేదన చెందారు.విలేకరి అక్రమాలపై ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ పత్రికలో పనిచేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న విలేకరిపై



విలేకర్లతో మాట్లాడుతున్న తమ్మినేని

చర్యలు తీసుకొని కేసునమోదు చేయాలని డిమాండ్ చేశారు. వాలంటీర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని, తమ పిల్లల ఫీజులు, ఇతర అవసరాల కోసం ఇలా మండలంలో సుమారు రూ.30లక్షలు వరకు అక్రమ వసూళ్లకు పాల్పడ్డాడని అన్నారు. బాధితులు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించు కోపోవడం అన్యాయ మన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శంకర్రావు,నాయకులు బి.శ్రీనివాస్. ఎస్.గోపాలం ఎ.సురేష్, యు.ప్రసాద్ పాల్గొన్నారు .

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు చరిష్మా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో వైఎస్ఆర్ నగర్‌కు చెందిన సిహెచ్ చరిష్మ ఫెన్సింగ్ పోటీల్లో సత్తా చాటింది. గత నెల 4 నుంచి 6 వరకు కాకినాడలో జరిగిన సబ్ జూనియర్ స్టేట్ మీట్ లో కాంస్యం గెలుచుకుని ఈ నెల 10 నుంచి 15 వరకు కేరళ లో కొచ్చిన్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న నేషనల్ పోటీలకు అర్హత సాధించింది. ప్రస్తుతం కేరళలో ఇప్పి విభాగంలో ఎపి జట్టు తరుపున జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తుంది. కత్తి సాము ఆట మీద ఆసక్తితో ఏడాదిన్నర కిందట కస్పా పాఠశాల ప్రాంగణంలో సాధన ప్రారంభించింది రెండో ప్రయత్నంలోనే స్టేట్ లో కాంస్యం సొంతం చేసుకొని నేషనల్ కు వెళ్లడం పట్ల పలువురు ఆనందం వ్యక్తం చేశారు. గతేడాది శ్రీకాకుళంలో కాంస్యం గెలుచుకుంది. ఈ బాలిక ప్రస్తుతం 8వ తరగతి ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో చదువుతుంది. ఫెన్సింగ్‌తో పాటు స్విమ్మింగ్, స్కేటింగ్ రాష్ట్ర స్థాయిలో ఆడిన అనుభవం ఉంది. సీనియర్ శిక్షకులు డివి చారి, శిక్షకులు ఎం.సతీష్ కుమార్ దగ్గర శిక్షణ పొందుతుంది. ఈ సందర్భంగా ఈ బాలికను, పుల్ బాగ్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రుక్సాన పర్వీన్, పిఇటి వి.ఎర్నమ్మ, శిక్షకులు డివి చారి, ఎం.సతీష్ కుమార్‌లను పలువురు అభినందించారు.

పాము కాటు బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పాముకాటుకు గురైన నగరానికి చెందిన ఎ.స్రవంతికి జెడ్పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సహృదయంతో స్పందిస్తూ శుక్రవారం తన ఛాంబర్‌లో రూ.15వేలు ఆర్థిక సాయం అందించారు. పాము కాటుకు గురైన స్రవంతికి విష ప్రభావంతో కుడి కాలు పనిచేయక పోవడం వల్ల భువనేశ్వర్‌లోని ఎయిమ్స్ హాస్పిటల్‌లో ఉచిత ఆపరేషన్ చేయించుకునేందుకు వెళ్లింది. స్పందించిన జెడ్పి చైర్మన్ స్పందించి రవాణా, ఇతర ఖర్చులకు ఆర్థిక సహాయం అందజేశారు.

16న స్పందన రద్దు

ప్రజాశక్తి-విజయనగరం

ఈనెల 16న జరగాల్సిన స్పందన వినతుల కార్యక్రమాన్ని కనుమ సందర్భంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి తెలిపారు. ఫిర్యాదుదారులు గమనించాలని ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్డు టాక్స్ పెంపు జిఒలను రద్దు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన 30 శాతం రోడ్ టాక్స్‌ను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ఆలిఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్(సిఐటియు) నాయకులు శుక్రవారం రవాణా శాఖ ఉప కమిషనర్ డాక్టర్ వి.సుందర్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ జిల్లా కన్వీనర్ ఎ.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ నిరంతరం పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు ఫీజులు పెనాల్టీలు, టోల్ ప్లాజా ఛార్జీలతో వాహనదారులు, రవాణా రంగ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మూలిగే నక్కపై తాటి పండు పడినట్లు త్రైమాసిక రోడ్డు టాక్స్ 30శాతం పెంచటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రోడ్డు టాక్స్ పెంచడం అంటే పరోక్షంగా ప్రజలపై భారాలు వేయటమేనని, తక్షణమే పన్నుల పెంపుదలను నిలుపుదల చేయాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో విజయనగరం లారీ ఓనర్స్



రవాణాశాఖ ఉప కమిషనర్‌కు వినతినిస్తున్న సిఐటియు నాయకులు

అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రాజేష్ రాజు , నల్లమారి, సభ్యులు శ్రీను, కరీమ్, మినీ వ్యాన్‌ల అసోసియేషన్ అధ్యక్షులు టి.సత్తిబాబు, కార్యదర్శి ఎం.వెంకట రామరాజు, ఎం.రవిరాజు, డి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా వెలుగులు నింపాలి : మంత్రి బొత్స

ప్రజాశక్తి-విజయనగరం

సంక్రాంతి పండగ ప్రతి ఇంటా వెలుగులు నింపాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు సంప్రదాయాలు ఉట్టి పడేలా.. డూడూ బసవన్నల కోలాహలం.. కొత్త చుట్టాల సందడి నడుమ పండగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. పంట చేతి కొచ్చే తరుణంలో సుఖ సంతోషాలతో మూడు రోజుల పాటు ఆనందంగా గడపాలని కోరుకున్నారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని వేడుకుంటూ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

సంక్రాంతి వేళ అంతా శుభం జరగాలి

సంక్రాంతి పండగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని కలెక్టర్ సూర్యకుమారి జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని, పంటలు బాగా పండాలని, సిరి సంపదలతో తులతూగాలని కోరుకున్నారు. జిల్లా ప్రజలకు మంచి ఆరోగ్య ప్రసాదించాలని.. సిరి సంపదలతో సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. పండగ శుభ వేళ ప్రతి ఇంటా సంతోషాల నిండుగా ఉండాలని తెలిపారు.

సత్య కళాశాల విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక తోటపాలెంలో గల సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎస్.పల్లవి జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ జూనియర్, సీనియర్ ఛాంపియన్షిప్‌లో అంతర్రాష్ట్ర విభాగంలో బంగారు పతకం, మొత్తంగా రజిత పతకం గెలుచుకుంది. స్నాచ్ లో 90 కేజీలు, జెర్క్ లో 112 కేజీలు మొత్తంగా 202 కేజీలు 64 కేజీల సీనియర్ గర్ల్స్ విభాగంలో ఈ పథకాలను సాధించుకుంది. ఈ పోటీలు మహారాష్ట్రలోని నాగర్ కోయిల్‌లో 28-12-2022 నుంచి 7-1-2023 వరకు జరిగాయి. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశి భూషణరావు, ఎం అనురాధ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. సాయి దేవ మణి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీ.



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్

మహేష్, కోచ్ చల్లా రాము, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. శశి భూషణ రావు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో పల్లవి రాణించి దేశానికి మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు.

సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 18 నుంచి 22వరకు బెంగుళూరులో జరుగనున్న సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. నగరంలోని ఎన్‌పిఆర్ భవనంలో శుక్రవారం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చిస్తారని తెలిపారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ధరల నియంత్రణ కోసం, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ,కనీస వేతనాల అమలు, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, రైతులకు గిట్టుబాటు ధర, స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలను చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.వి.రమణ, విజయనగరం పట్టణ అధ్యక్షులు ఎ.జగన్మోహన్ పాల్గొన్నారు.

ఒంటరిగా గెలవలేకే పొత్తులు : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ముఖ్యమంత్రి కావాలని రాజకీయాలకు వచ్చిన పవన కళ్యాణ్ ఒంటరిగా గెలవలేకే పొత్తులు పెట్టుకుంటునాక్నరని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి విమర్శించారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవన కళ్యాణ్ వ్యాఖ్యలను ఆయన ఖండించారు. మూడు ముక్కలు అట అన్న పవన కళ్యాణ్ బిజెపిని ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. తన సభలకు వస్తున్న జనం ఓటు వెయ్యలేదని చెప్పడం బట్టి కేవలం ఆయనను చూడటానికి వచ్చారు అనే విషయం తెలుసుకోవాలన్నారు. వెంట తరబడి కొడతాం, బట్టలు ఊడదీసి కొడతాం అనే వ్యాఖ్యలు సినిమా డైలాగులకు పనికొస్తాయన్నారు. అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానిది అన్నారు. ప్రభుత్వ తప్పిదాలను ప్రతిపక్షాలు బయట పెట్టగలిగారా అని ప్రశ్నించారు. ఎన్ని రాజకీయ పార్టీలు కలిసినా వైసిపిని ఓడించలేవన్నారు.

ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని శ్రీమన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో గురువారం సంగీత త్రిమూర్తులలో ఒకరైన సద్గురు శ్రీత్యాగరాజస్వామి ఆరాధనోత్సవం వైభవంగా జరిగింది. ఫ్రెండ్స్ ఫైనార్ట్స్ అసోసియేషన్, రోటరి డిఎస్ఆర్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ,రోటరిదశిగిపేర్రాజు మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా పైడితల్లి అమ్మవారి ఆలయం నుండి శ్రీత్యాగరాజస్వామి చిత్రపటానికి ఆలయ అర్చకులు హారతులు ఇచ్చిన తర్వాత మంగళవాద్యాలతో వేదికవరకు తిరువీధోత్సవం జరిగింది. అనంతరం మ్యూజిక్ అకాడమీతో పాటు నగరంలోని పలు సంగీత కళాశాలలు, పాఠశాలకు చెందిన కళాకారులు ,విద్యార్థులు త్యాగరాజ పంచరత్న కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో ఎఫ్ఎఫ్ఎ ప్రతినిధులు, మ్యూజిక్ అకాడమీ అధ్యక్ష ,కార్యదర్శులు డాక్టర్ మండపాకరవి, ఉసిరికల చంద్రశేఖర్, డాక్టర్ డి.వి.శ్రీకాంత్, డాక్టర్ అయగారి రాఘవరావు, జి.వీరభద్రరావు, కళాకారులు కామేశ్వరరావు ,రామ్ చరణ్, హారికశివరాం, కె.పద్మప్రియ వాద్య విశేషాలతో అలరించారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి : డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం

తెలుగువారి సంస్కృతిని ప్రతిబింబించేలా సంక్రాంతి సంబరాలు కన్నుల పండువగా జరిగాయి. స్థానిక శిల్పారామంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా భోగి మంటతో సంబరాలు ప్రారంభమయ్యాయి. హరిదాసు కీర్తనలు, గంగిరెద్దులూ, గాలిపటాలు, బుడబుక్కలు, కోలాటాల నడుమ, సాంస్కృతిక ప్రదర్శనలతో సంబరాలు అంబరాన్ని అంటాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు, మన సంప్రదాయ వస్త్రధారణతో వేడుకలకు హాజరై అలరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంప్రదాయ పిండివంటల పోటీలు ఆకట్టుకున్నాయి.



గంగిరెద్దు విన్యాసాలు తిలకిస్తున్న మహిళా అధికారులు

మన సంస్కృతిని కాపాడాలి

మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని డిప్యుటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. సంక్రాంతి సంబరాలకు ముఖ్య అతిధిగా హాజరైన కోలగట్ల మాట్లాడుతూ, రైతుల కష్టఫలం ఇంటికి చేరే రోజు కాబట్టి, సంక్రాంతి పండుగను తెలుగువారు అత్యంత ఘనంగా నిర్వహించుకుంటారని అన్నారు. రైతు బాగుంటేనే సమాజం బాగుటుందన్నది సంక్రాంతి పండుగ చాటి చెబుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు.

మహోన్నతమైన పండగ సంక్రాంతి

తెలుగువారు ప్రపంచంలో ఏ మూల నున్నా, అత్యంత ఘనంగా జరుపుకొనే మహోన్నత పండగ సంక్రాంతి అని జెడ్పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గత 15 ఏళ్లలో ఎన్నడూ లేని రీతిలో ఈ ఏడాది పంటలు బాగా పండి, రికార్డు స్థాయిలో దిగుబడులు వచ్చాయని, రైతులు చాలా సంతోషంగా ఉన్నారని చెప్పారు.

అన్నదాత సుభిక్షంగా ఉండాలి

అన్నదాత సుభిక్షంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆకాంక్షించారు. రైతు లోగిళ్లలో ధాన్యపు రాశులు కురవాలని, తద్వారా సమాజం కూడా సుఖసంతోషాలతో ఉండాలని కోరారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఉన్నతాధికారులు సైతం తమ హోదాను పక్కనపెట్టి, ఈ సంబరాల్లో ఆడిపాడి అలరించారు. జిల్లా స్త్రీశిశు సంక్షేమ, సాధికారతాధికారి బి.శాంతకుమారి, స్పెషల్ డిప్యుటీ కలెక్టర్ పద్మలత, ఎపిఎం సులోచన, ఐసిడిఎస్ ఉద్యోగి సుభాషిణి పాటలు పాడి ఆకట్టుకున్నారు.



భోగి మంట వేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పి చైర్మన్ శ్రీనివాసరావు

మరో స్పెషల్ డిప్యుటీ కలెక్టర్ సుదర్శన దొర కర్రసాము ప్రదర్శించారు. ప్రభుత్వ సంగీత నత్య కళాశాల విద్యార్థులు సంక్రాంతి నృత్య రూపకాలతో అలరించారు. రంగవల్లుల పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాల్లో నిలిచిన సులోచన, ప్రవీణ, జ్యోత్స్న, పాల్గొన్న ప్రతీఒక్కరికీ బహుమతులు అందజేశారు. వంటల పోటీల్లో రమణమ్మ, దుర్గ, నాగమణి ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాల్లో నిలిచారు. డిఆర్ఒ ఎం.గణపతిరావు, స్పెషల్ డిప్యుటీ కలెక్టర్లు సుదర్శనదొర, సూర్యనారాయణ, పద్మలత, వెంకటేశ్వర్రావు, ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి, జిల్లా టూరిజం అధికారి పిఎన్‌వి లక్ష్మీనారాయణ, జిల్లా పౌర సంబంధాల శాఖాధికారి డి.రమేష్, మహారాజా సంగీత కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌వి ప్రసన్నకుమారి విజేతలకు బహుమత్రి ప్రదానం చేశారు. ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎంఎల్‌సి డాక్టర్ పి.సురేష్‌బాబు, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యుటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పట్టణానికి పండగ శోభ


బొబ్బిలి: జనంతో కిక్కిరిసిన మార్కెట్ రోడ్డు

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి పట్టణానికి పండుగ శోభ వచ్చింది. సంక్రాంతికు ఒక్కరోజు మాత్రమే గడువు ఉండడంతో నిత్యావసర సరుకులు, దుస్తులు కొనుగోలు చేసేందుకు గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో జనం రావడంతో మార్కెట్ కిక్కిరిసింది. పట్టణంలో ఏకూడలిలో చూసిన జనం కిక్కిరిసి కనిపించారు. షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. జనం రద్దీగా ఉండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బట్టలు షాపులు కొనుగోలుదారులతో కలకళలాడాయి. మార్కెట్‌కు వచ్చిన వారంతా ఎన్‌టిఆర్ బొమ్మ, తాండ్ర పాపరాయ విగ్రహం ముందు వాహనాలు పార్కింగ్ చేయడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

పారాది వంతెన వద్ద స్తంభించిన ట్రాఫిక్


బొబ్బిలి: పారాది వంతెన వద్ద నిలిచిపోయిన వాహనాలు

పారాది వంతెన వద్ద ట్రాఫిక్ స్తంభించింది. సంక్రాంతి నేపథ్యంలో వాహనాలు రద్దీ పెరగడంతో వంతెన వద్ద మూడు రోజులుగా ట్రాఫిక్ స్తంభిస్తుంది. ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రామభద్రపురం నుంచి బొబ్బిలి, బొబ్బిలి నుంచి రామభద్రపురం వైపు వెళ్లే వాహనాలు సంఖ్య పెరిగింది. వాహనాలు రద్దీ పెరగడంతో శుక్రవారం ప్రయాణికులు నరకయాతన పడ్డారు. అధికారులు స్పందించి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు సంక్రాంతి సంబరాలు

శృంగవరపుకోట : పట్టణంలోని ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో శిక్షణ పొందుతున్న ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో సంక్రాంతి సంబరాలను శనివారం నిర్వహించనున్నట్లు చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. సంబరాల్లో భాగంగా బ్యాడ్మింటన్ శిక్షణ పొందుతున్న క్రీడాకారులను సబ్-జూనియర్, జూనియర్, సీనియర్స్ విభాగాలుగా విభజించి వారి మధ్య సింగిల్స్, డబుల్స్‌గా విభజించి పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీరాములు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు శనివారం క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఎస్.వి సత్యశేఖర్, ఆనల రమేష్, ఆనల మోహన్ చేతులమీదుగా బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందన్నారు.

గ్రామాలలో క్రీడలు

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని వినాయకపల్లి గ్రామంలో మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం నుండి నిర్వహించనున్నట్లు వినాయకపల్లి యూత్ అసోసియేషన్ యువకులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయకపల్లి గ్రామానికి చెందిన తమ ఆత్మీయ బంధువు సరిపల్లి సంతోష్ ఇటీవల అకాల మరణం చెందారని, సంతోష్ పేరు మీద తమ గ్రామంలో మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు.

తహశీల్దార్ కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు

భోగాపురం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ సిబ్బందితో కలిసి భోగిమంటలు వేసి సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది అంతా సాంప్రదాయ దుస్తుల్లో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు, విఆర్‌ఒలు, సర్వేయర్లు, విఆర్‌ఎలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


భోగాపురం: సంప్రదాయ వస్త్రాలతో రెవెన్యూ ఉద్యోగులు

అధికారి పార్టీలో అభద్రతాభావం

వేపాడ : అధికార పార్టీలో అభద్రాభావం నెలకొందని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గొంప వెంకటరావు అన్నారు. ఆయన శుక్రవారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. పవన్ కల్యాణ్, చంద్రబాబు బేటీ కావడంతో వైసిపిలో వణుకు మొదలైందన్నారు. ఇప్పటికే మండలంలో వైసిపిలో గ్రూపు రాజకీయాలు పెరిగిపోయాయని గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఎవరి మాట వినాలో తెలియన అయోమయంలో కార్యకర్తలున్నారని చెప్పారు. తన ఆధ్వర్యంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని విజయవంతం నిర్వహించామన్నారు. తానొక్కడినే కష్టపడినంత మాత్రాన టిడిపి విజయం సాధించదని అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని చెప్పారు. అధిష్టానం ఎవరికి టిక్కెట్టు ఇస్తే వారి పక్క పనిచేయడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు.

పాటూరులో పారిశుధ్య పనులు


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కార్యదర్శి సంధ్య

వేపాడ : మండలంలోని పాటూరు గ్రామంలో శుక్రవారం పారిశుధ్యం పనులు చేపట్టారు. సచివాలయ కార్యదర్శి సంధ్య గ్రామంలోని కాలువల్లో పూడికల తొలగింపు కార్యక్రమాన్ని శుపర్యవేక్షించారు. వీధి కాలువలో పేరుకుపోయిన చెత్తతో పాటు మురికి మట్టిని కూడా తీయించి గ్రామం శివారులో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌కు తరలించి తడి చెత్తను పొడి చెత్తను వేరు చేయించి చెత్త నుండి తయారు చేసే సంపద కుండీలలో వేయించారు. అనంతరం గ్రామంలో రోడ్లకు ఇరువైపులా బ్లీచింగ్ పౌడర్ చల్లించడంతో పాటు దోమల నివారణ మందును కాలువల్లోనూ పిచికారి చేయించారు.

భవనం మంజూరు చేయాలి

భోగాపురం : ఎపి ఎన్‌జిఒ తాలూకా యూనిట్ ఉద్యోగులు తమకు భవనం మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణను నూతనంగా ఎన్నికైన ఎన్‌జిఒ తాలూకా యూనిట్ కార్యవర్గం శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భోగాపురంలో ఎన్‌జిఒ భవనానికి స్థలం మంజూరు చేయించాలని ఎన్‌జిఒ అధ్యక్షులు కొమ్మూరు దుర్గారావు కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సంతోష్, ఎన్‌జిఒ అధ్యక్షులు జగదీష్, ఉపాధ్యక్షులు గణపతి, సత్యనారాయణ, జి.సత్యనారాయణ, మహిళా కార్యదర్శి కృష్ణవేణి, కార్యవర్గ సభ్యులు సుధాకర్, లక్ష్మణరావు, రమణమూర్తి, ఉదయ్ కుమార్, సూరి అప్పారావు, భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

పవన్‌కు రాజకీయ పరిపక్వత లేదు: ఎమ్మెల్యే

బొబ్బిలి : జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు రాజకీయ పరిపక్వత లేదని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు విమర్శించారు. వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్‌కు రాజకీయ పరిపక్వత లేదని చెప్పడానికి రణస్థలం యువశక్తి సభలో ప్రసంగాన్ని ఉదాహరణగా చెప్పుకోవచ్చునన్నారు. జనసేనను గెలిచే సత్తా లేకపోవడంతోనే పొత్తు పెట్టుకునేందుకు ఆలోచిస్తున్నట్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాజకీయాలకి వచ్చిన తర్వాత విమర్శలు తట్టుకునే శక్తి ఉండాలన్నారు. టిడిపితో పొత్తు కోసం పవన్ కళ్యాణ్ తహతహలాడుతున్నాడని విమర్శించారు. గెలుస్తాననే ధైర్యం ఉంటే సింగిల్‌గా పోటీ చేయాలని పవన్‌కు సూచించారు. రాజకీయాలలో సక్సెస్ సాధించడం అంత సులువు కాదన్నారు. సినిమా రంగంలో సక్సెస్ అయిన వారంతా రాజకీయాల్లో సక్సెస్ అవ్వలేరని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

భోగాపురం : మండలంలోని సవరవిల్లి సమీపంలోని జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనదారుడు శుక్రవారం డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం జిల్లా పొందూరుకు వెళ్తున్న రాము బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టాడు. స్థానికులు 108 కి సమాచారం అందించడంతో హైవే అంబులెన్స్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని ప్రథమ చికిత్స అనంతరం జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించారు.

గొర్రెపోతు పందాలు నిర్వహిస్తే చర్యలు


మాట్లాడుతున్న ఎస్ఐ

వంగర: మండలంలోని ఏ గ్రామంలోనైనా గొర్రెపోతు పందాలు, కోడి పందాలు, పేకాట శిబిరాలు వంటివి నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ బుడుమూరు లోకేశ్వరరావు అన్నారు. ఈ మేరకు వంగర పోలీస్ స్టేషన్లో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పండగ నేపథ్యంలో దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున ఎవరైనా తమ బంధువులు ఇళ్లకి వెళ్లేటప్పుడు తమ ఇంటి వద్ద తాళం వేసి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు సంక్రాంతి పండుగను చక్కగా జరుపుకోవాలని కోరారు.


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

మండల స్థాయి వాలీబాల్ పోటీలు

కొత్తవలస : మండలంలోని వసంత విహార్ ప్రాంగణంలో ఎప్‌టిపి న్యూస్, వసంత విహార్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా మండల స్థాయి వాలీబాల్ పోటీలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలో మొదటి బహుమతిగా రూ. 10వేలు వసంత విహార్ చైర్మన్ వల్లూరి జయప్రకాష్ బాబు, రెండవ బహుమతి రూ.5వేలు ఎప్‌టిపి న్యూస్ చైర్మన్ విశ్వనాధ్ పాలకుమార్, మూడవ బహుమతి రూ. 3వేలు న్యూస్ రిపోర్ట్ రావలపూడి గోవింద అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ వీర జనార్దన్, ఒకటవ వార్డు సభ్యులు కర్రీ సూర్య నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ ప్రారంభించిన ఎంపిపి


విద్యుత్ లైన్‌ను ప్రారంభిస్తున్న ఎంపిపి గేదెల

లక్కవరపుకోట : మండలంలోని రంగాపురం గ్రామ పంచాయతీ లో కొత్తవలస - అరకు ప్రధాన రహదారి నుండి రంగాపురం వరకు సుమారు కిలోమీటర్ దూరంలో గల దారి పొడవునా 15 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ కలెక్షన్ ఇచ్చారు. వీటిని ఎంపిపి గేదెల శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. దీర్ఘకాలంగా వెంటాడుతున్న విద్యుత్ సమస్య ఎట్టకేలకు పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించినప్పుడు ఆయన దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించిన ఆయన రూ. 4 లక్షలతో విద్యుత్ లైన్ ప్రారంభించినట్లు ఎంపిపి తెలిపారు.

ముగ్గురు యువకులు అరెస్టు

బొబ్బిలి : స్థానిక గ్రోత్ సెంటర్ సమీపంలో గంజాయితో పట్టుబడిన ముగ్గురు యువకులను శుక్రవారం రాత్రి అరెస్టు చేసినట్లు ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ తెలిపారు. ఆయన అందించిన వివరాలు ప్రకారం.. సిఐ మలిరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గంజాయిపై నిఘా పెట్టాం. పట్టణంలో పీపురపల్లి వీధికి చెందిన పెదబాలియెరు రామలింగేశ్వరరావు, ముక్కి విష్ణువర్ధన్, ఇందిరమ్మ కాలనీకి చెందిన పల్లేడ సాయివెంకటకరుమలు ఒడిశాలోని సుంకి ప్రాంతం నుంచి గంజాయి తెచ్చి బొబ్బిలి ప్రాంతంలో విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో నిఘా వేసి పట్టుకున్నారు. అరకిలో గంజాయిని సుంకిలో కొనుగోలు చేసి తెచ్చి చిన్న సైజు ప్యాకెట్లు తయారు చేసి ఒక్కొక్కటి వంద రూపాయల చొప్పున విక్రయిస్తున్నారు. సిఐ నాయకత్వంలో తామంతా పాల్గొని వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

అలజంగిలో పొలంబడి

బొబ్బిలి రూరల్ : మండలంలోని అలజంగి గ్రామంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడి ఎం. శ్యామ్ సుందర్ మాట్లాడుతూ అపరాల పంటపై ఈ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు. పెసలు మినప పంటలో వచ్చే బూడిద తెగులు, పూత, పిందిపై పచ్చ పురుగు రైతులకు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో అలజంగి గ్రామ రైతులు, అలజంగి, కాసింతర వలస, పెంట జగన్నాధపురం, దెబ్బ కుడి వలస, కలవరాయి, చింతాడ, కోమటపల్లి గ్రామ వ్యవసాయ సహాయకులు లతా, దుర్గా, రవళి, సుస్మిత, మణి, ప్రియ, వరలక్ష్మి, రేణుక పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఎడి


పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న అంబళ్ల

పోషకాహారం కిట్లు పంపిణీ

నెల్లిమర్ల : మండలంలోని ఒమ్మి గ్రామంలో గర్భిణులకు శుక్రవారం పోషకాహారం కిట్లు పంపిణీ చేపట్టారు. సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ల శ్రీరాములనాయుడు అంగన్ వాడీ కేంద్రంలో గర్భిణులకు పోషకాహారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషకాహారం అందిస్తుందన్నారు. ముఖ్యంగా తల్లీ, పిల్లలు, గర్భిణుల ఆరోగ్యం, పెరుగుదల కోసం పోషకాహారం కిట్లు పంపిణీ చేస్తుంది కాబట్టి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దురగాశి ఎల్లం నాయుడు, అంగాన్ వాడీ కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి కుళాయిలు ప్రారంభం

ప్రజాశక్తి - వేపాడ


కుళాయిని ప్రారంభిస్తున్న ఎంపిపి సత్యవంతుడు

మండలంలోని బొద్దాం గ్రామంలో ఎంపిపి డి. సత్యవంతుడు ఇంటింటి కోలాయిలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సమస్య పరిష్కరించేందుకు తన నిధుల నుండి రూ. 3లక్షలు మంజూరు చేశామన్నారు. ఈ నిధులతో మూడు వీధుల్లో 50 ట్యాప్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ఇ. దేవి, ఎంపిడిఒ పట్నాయక్, వైస్ ఎంపిపి అడప ఈశ్వర్రావు, వైసిపి జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మెరుపుల సత్యనారాయణ, నాయకులు దుల్ల పూర్ణకుమారి, ఎంపిటిసి పిల్ల లక్ష్మి, టివి రమణ, గ్రామ సర్పంచ్ యర్రా సన్యాసిరావు, ఉప సర్పంచ్ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి పద్మావతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ కామేష్ సచివాలయ సిబ్బంది గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు..

టేకు కలప అక్రమ రవాణా

ప్రజాశక్తి - వేపాడ


తరలింపునకు సిద్ధంగా ఉన్న కలప

మండలం లోని పోతుబందిపాలెం గిరిజన గ్రామానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో చింత చెట్లు కింద టేకు చెట్లు నరికి అక్రమంగా రవాణాకు సిద్ధం గుర్తు తెలియని వ్యక్తులు సిద్ధం చేస్తున్నారు. అటవీ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు ఇష్టానుసారంగా వ్యవహరించి టేకు మొక్కలను నరికివేసి తరలించేస్తున్నారు. పైగా కొంత మంది అధికారులు అక్రమ కలప రవాణా దారులకు అండగా నిలుస్తూ కాసులు దండుకోవడం ఆనవాయితీగా వస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులో లేరు. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు తగు చర్యలు చేపట్టి పర్యావరణ పరిరక్షణను కాపాడుతారని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పల్లెబాట పట్టిన పట్టణం

ప్రజాశక్తి- విజయనగరం కోట

సంక్రాంతి పండగ నేపథ్యంలో పట్టణంలో నివాసముంటున్న వారంతా పల్లె బాట పడుతున్నారు. దీంతో విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్స్ ప్రయాణికులతో శుక్రవారం కిటకిటలాడింది.. సకాలంలో బస్సులు రాక చాలా మంది ప్రయాణికులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఎదురైంది. పట్టణంలో అద్దెలకు నివాసం ఉంటూ ఇక్కడే జీవనోపాది పొందుతున్న వారితో పాటు ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్న వారంతా కచ్చితంగా సంక్రాంతి పండగకు వారి స్వగ్రామాలకు వెళ తుంటారు. ఇందులో భాగంగానే ఆర్‌టిసి కూడా ఏర్పాట్లును చేసినప్పటికీ అనుకున్నకంటే ఎక్కువ మంది ప్రయాణించడం వల్ల బస్సుల చాల్లేదు. దీంతో గంటల కొద్ది ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో ప్రయాణికులు వేచి ఉండాల్సి వచ్చింది. ముఖ్యంగా విజయనగరం నుంచి పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, పాలకొండ, రాజాం, చీపురపల్లి వంటి దూర ప్రాంతాలకు వెళ్లేవారు బస్సులు కోసం ఇబ్బంది పడ్డారు.


బస్సులు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు


ఒకేసారి బస్సు ఎక్కెందుకు వెళుతున్న ప్రయాణికులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరం

శిల్పారామం వేదికగా జరిగిన సంక్రాంతి సంబరాలు సరదా సరదాగా సాగాయి. సమాచార పౌర సంబంధాల శాఖ పర్యవేక్షణలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సంగీత గాత్ర కచేరీలు, నాట్య విన్యాసాలు, ఫాన్సీ డ్రెస్ పోటీలు, జానపద గేయాలాపనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. మహారాజ సంగీత కళాశాల, అమత వర్షిణి సంస్థ విద్యార్థులు, నిర్వాహకులు ఆలపించిన గీతాలు వీనుల విందుగా సాగాయి. ఘంటశాల కళాపీఠం భీష్మా మాస్టారి ఆధ్వర్యంలో బృంద సభ్యులు అత్యంత హద్యంగా అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. ఈ క్రమంలో జరిగిన ఫాన్సీ ఫ్రెష్ పోటీలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. పలువురు వృద్ధ కళాకారులు ఉత్సాహంగా పాల్గొని పల్లె సంప్రదాయాలను ప్రతిబింబించే పలు జానపద గీతాలను ఆలపించి ఆహుతులను ఆనందింపజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు కళాకారులను అభినందించారు.

విజేతలకు బహుమతులు

ఫాన్సీ డ్రెస్ పోటీల్లో ప్రథమ బహుమతి స్వర్ణ, ద్వితీయ బహుమతి అరుణ కుమారి, తృతీయ బహుమతి సుహాన గెలుచుకున్నారు. ముఖ్య అతిథుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. స్వచ్ఛందంగా పాల్గొన్న కళాకారులకు నిర్వాహకులు నగదు ప్రోత్సాహకం అందించింది సత్కరించారు. పోటీలను జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి డి. రమేష్, ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి, పర్యాటక శాఖ అధికారి లక్ష్మీనారాయణ, వయోజన విద్య శాఖ డిడి సుగుణాకరరావు, మెప్మా పీడీ సుధాకర్, విజయనగరం తహశీల్దార్ బంగార్రాజు తదితరులు పర్యవేక్షించారు.


కోలాటం చేస్తున్న మహిళలు


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపి బెల్లాన చంద్రశేఖర్


నృత్యం చేస్తున్న బాలిక

ధాన్యం కొనుగోలుకు బ్రేక్..!

- టార్గెట్ పూర్తి కావడంతో నిలిచిపోయిన వైనం

ప్రజాశక్తి- జామి

జిల్లాలో ధాన్యం కొనుగోలు నిలిచిపోయాయి. ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తయిన నేపథ్యంలో కొనుగోలు నిలిపేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ధాన్యం కొనుగోలు చేస్తారని చాలా మంది రైతులు ఇంకా కళ్ళాల్లో ధాన్యం రాశులు పెట్టుకుని, ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పండగ పూట రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఈ ఏడాది 3.37 లక్షల ఎకరాల్లో రైతులు వరిని పండించారు. సుమారు 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేయగా, 2.60 మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే 2.48లక్షల టన్నులు కొనుగోలు చేపట్టారు. లక్ష్యానికి సమీపం కావడంతో జిల్లా వ్యాప్తంగా కొనుగోలు నిలిచిపోయాయి. దీంతో గత రెండు రోజులుగా రైతులు కళ్లాల్లోనే పడిగాపులు కాస్తున్నారు. ఒకవైపు ధాన్యం కొనుగోలు మిల్లర్లు దోపిడీ రాజ్యమేలగా, మరోవైపు కొనుగోలు తాత్సారం రైతులను ఈ ఏడాది ముప్పు తిప్పలు పెడుతుంది. వాస్తవానికి గతం కన్నా, మిల్లర్లు దందా పెరిగిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రూ.కోటి బ్యాంకు గ్యారంటీతో రూ.కోటి విలువ చేసే ధాన్యం కొనుగోలుకు అవకాశం కల్పించాగా, నేడు అదే గ్యారంటీతో రూ.4కోట్లు ధాన్యం కొనుగోలు చేసే, అవకాశాన్ని కల్పించారు. కానీ బ్యాంకు గ్యారెంటీలు లేని కారణంగా కొనుగోలు నిలిపేశారు.

నేటి నుంచి ప్రారంభిస్తాం..

గురువారంమధ్యాహ్నం నుంచి ధాన్యం కొనుగోలు నిలిచిపోయాయి. లక్ష్యానికి పరిమితి పెంచమని ప్రభుత్వానికి నివేదికిచ్చాం. అనుమతి వచ్చింది. శనివారం నుంచి యదావిధిగా కొనుగోలు జరుగుతుంది. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు.

మీనా కుమారి, డిఎం, విజయనగరం

ఎట్టకేలకు విద్యుత్తు దీపాలు ఏర్పాటు

వీరఘట్టం : మండలంలోని తూడి గ్రామ సిఎస్‌పి రహదారి నుంచి గ్రామం వరకూ సుమారు కిలోమీటర్ దూరంలో విద్యుత్ లైన్‌తో పాటు దీపాలను శుక్రవారం ఎంపిపి డి.వెంకటరమణనాయుడు ప్రారంభించారు. గత ఏడాది జూలై 31న ఇదే గ్రామానికి చెందిన సర్పంచ్ కె.వెంకటరమణ మండల సర్వసభ్య సమావేశంలో విద్యుత్తు లైన్‌తో పాటు దీపాలు ఏర్పాటు చేయాలని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఎంపిటిసిలు, 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.6 లక్షల పైబడి అంచనా వ్యయంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలోక పెట్టుకొని ఎట్టకేలకు విద్యుత్తు లైనుతో పాటు దీపాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు విజయ కుమారి, పిఎసిఎస్ అధ్యక్షులు గోవిందరావు , రేగులపాడు సర్పంచ్ ఎం.ఉషారాణి, సచివాలయ కార్యదర్శి ఎ.చిన్నారావు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు .

ప్రజారోగ్యంలో పరిసరాల పరిశుభ్రత కీలకం

పార్వతీపురంరూరల్,గరుగుబిల్లి : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల చాలా అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన మండలంలో ఉల్లిభద్ర, ఎర్రన్నగుడి జంక్షన్ వద్ద పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని, లేనిచో అవి దోమలకు ఆవాసాలుగా మారి వివిధ రకాల జ్వరాలకు కారణమవుతాయని తెలిపారు. ప్రతి షాపు వద్ద విధిగా చెత్త బుట్టలు ఉంచాలని, పరిసరాల్లో చెత్త వేయకుండా చూసుకోవాలని షాపు యజమానులకు సూచించారు. అనంతరం వైద్య సిబ్బంది నిర్వహించిన ఫ్రై డే - డ్రై డే ర్యాలీలో పాల్గొన్నారు.

ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి -గంట్యాడ

మండలంలోని కరకవలసలోని ప్రేమ రెసిడెన్సీలో నివాసముంటున్న అవనాపు సతీష్ (40) గురువారం రాత్రి తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. సతీష్‌కు పిల్లల్లేకపోవడం, మరో ఆస్తి తగదాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. సతీష్ నెల్లిమర్ల డైట్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కోనేరులో పడి మూడేళ్ల బాలుడు మృతి

ప్రజాశక్తి - డెంకాడ

భోగాపురం మండలం పోలిపల్లిగ్రామంలో కోనేరులో జారిపడి మూడేళ్ల బాలుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ముడసల గురువులు, లక్ష్మి దంపతులు పోలిపల్లికి వలస వచ్చి జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం వారు కుమారులిద్దరూ కోనేరు వద్ద ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తూ జారిపడి ఇద్దరూ కోనేరులో పడిపోయారు. పెద్ద కుమారుడు ప్రాణాలతో బయటపడగా, చిన్న కుమారుడు గౌతమ్ మృతి చెందాడు.

కంప్యూటర్ ఆపరేటర్ ఆత్మహత్యాయత్నం

జియ్యమ్మవలస: మండలంలోని మరుగువాడకు చెందిన ఆరిక రాజశేఖర్ శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్యహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన అతని మేనమామ రాజశేఖర్‌ను పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. రాజశేఖర్‌కు తల్లిదండ్రులు లేకపోవడంతో మేనమామ వద్ద ఉంటూ జియ్యమ్మవలసలోని ఉపాధిహామీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆత్మహత్యాత్నానికి గల కారణాల తెలియాల్సి ఉంది. ఈ సంఘటనపై పార్వతీపురం ఔట్ పోసు పోలీసులు కేసు నమోదు చేశారు.